మిసిమి

(A Telugu Fortnightly)

10-6-1990

మిసిమి

MISIMI

(A Telugu Fortnightly)

సంపుటి 1 | 10-6-1990 | సంచిక 8

విషయసూచిక

మానవతావాది యం.యన్. రాయ్

— శిబ్‌నారాయణ్ రే

(రచయిత 1954 నుంచి 1962 వరకూ రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక సంయుక్త సంపాదకుడు. కలకత్తా, బొంబాయి విశ్వ విద్యాలయాలలో అధ్యాపకుడు. మెల్బోర్న్ విశ్వవిద్యాలయంలో 18 సంవత్సరాలపాటు భారతీయ తత్వాన్ని గరపే పాఠ్య క్రమ విభాగాధ్యక్షుడు, విశ్వభారతిలో రెండేళ్లు పాటు రబీంద్ర భవనం డైరెక్టరు. ప్రస్తుతం ఎం.ఎన్. రాయ్ రచనలను ఆరు సంపుటలలో ప్రచారించడానికి పరిష్కరణకు కృషి చేస్తున్నాడు.)

మానవతావాది యం.ఎన్. రాయ్

మనిషి తన గతికి తనే కర్త. తన మనుగడ ఏ ఏ పరిస్థితులలో కొనసాగుతున్నప్పటికీ మనిషికి స్వతస్సిద్ధమైన స్వతంత్రం ఉంది. స్వతంత్రం కోసం కృషి, సత్యాన్వేషణ, పరస్పర పరిపూర్ణత్వానికి దోహదం చేసేవి, మానవ అభ్యున్నతికి సహజ ఆధారాలు. ఈ రెండు సాధనలే మానవ ప్రగతిని విదితం చేసే ఇతిహాస ప్రధానాంశాలు. వ్యక్తి శక్తి వికాసానికి గల అవరోధాలను ఒక క్రమంలో తొలగించడానికి వివిధ సంఘాలు, నాగరికతలు చేసే కృషి, మానవ సంఘంలో ప్రతివారూ అనుభవించే స్వతంత్ర స్థాయి వివరణలే ఈ ఇతిహాసం. ఇది రాడికల్ కమ్యూనిజం (మానవతావాదం) కర్త (దార్శనికుడు) ఎం.ఎన్. రాయ్ చెప్పిన సిద్ధాంతం.

శ్రీ రాయ్ తన జీవిత యాత్రలోని కడపటి ఎనిమిది సంవత్సరాలలో (1946-54) మానవతా వాదాన్ని తీర్చిదిద్దాడు. రాడికల్ డెమాక్రసీ (ప్రజాస్వామిక తత్వం)ని గురించి ఆయన 1946లో వ్రాసిన ఇరవై రెండు సిద్ధాంతాలలో, మానవతావాద వివరణ ఉన్నది. 1947లో నవ మానవతా వాద ప్రణాళికను ప్రచురించాడు. దీనినే సవివరంగా 1952లో ''హేతువు, ఊహ, విప్లవం'' అనే బృహత్ గ్రంథంలో పొందుపరచాడు. ఆయన మేధోవికాసానికి, నవ మానవతా వాదం పరాకాష్ట. ఆయన జీవితమే ఈ తత్వానికి ఉదాహరణ. రాయ్ విప్లవాత్మకమైన మేధావి. ఆయన ఆలోచన కేవలం చర్చలకు పరిమితమైనది కాదు; ఆచరణశీలం గలది.

విప్లవవాదిగా ఆయనకు సంప్రాప్తించిన అసంఖ్యాక అనుభవాల నుంచి మొలకెత్తినది ఆయన తత్వం. అసాధారణ జీవితం. తత్వమూలాన్నీ, ఆచరణలో ఎదురయ్యే సమస్యలను ఆకళించుకుని, వాటిని సమన్వయం చేస్తూ, తన ''ఇరవై రెండు సిద్ధాంతాలు''లో ఆయన ఒక సమీకృత దర్శనాన్ని వెలయించ గలిగాడు. నాకు ఆయనతో 1946 నుంచి 1954 వరకూ సాన్నిహిత్యం ఉంది. ఆయన రచనలను సరిచూసి, వరస క్రమంలో తీర్చి ఆరు సంపుటాలుగా ప్రచురణకై రూపొందించాను. ఆయన జీవిత కథ ప్రథమ భాగం, స్వాతంత్ర్యాన్వేషణ, ఇటీవలే పూర్తి చేసాను.

ఆయన సమకాలిక విప్లవవీరులు లెనిన్, మావో ప్రభృతులు — ఆనాటి సాంఘిక పరిస్థితులను బట్టి, విప్లవశీలాన్ని పెంపొందించుకున్న వారే వీరందరూ -- సమకాలీన పరిస్థితులను, ఐతిహాసిక పరిజ్ఞానాన్ని అనుసరించి, విప్లవశీలాన్ని రూపొందించుకున్నవారే -- అయితే లెనిన్, మావోల వలే స్వదేశాన్ని విప్లవ మార్గంలో తీసుకువెళ్లలేక పోయాడు రాయ్ -- రష్యా, చైనాలకూ భారత దేశానికీ తేడాలు అనేకం ఉన్నాయి కాబట్టి, రాయ్ అట్లా చేయలేదనవచ్చు -- అంతేగానీ, దార్శనికుడుగా, నాయకుడిగా రాయ్‌కి తగు నాయకత్వ లక్షణాలు లేకపోవడమే దీనికి కారణం అనరాదు. భారత దేశంలో, అధికార మార్పు పరస్పర అంగీకారాల ద్వారా జరిగింది -- పరిపాలనా వ్యవస్థను, సైనిక వ్యవస్థను పదిలంగా భారతీయులకు దత్తం చేశారు సామ్రాజ్యవాదులు -- ఇట్లా దత్తమైన వ్యవస్థను స్వీకరించడానికి సుసంఘటితమైన, పరిపాలనా నిర్వహణ పట్ల ఆసక్తి కలిగిన, సాంఘిక విప్లవానికి ప్రతికూలంగా

ఉన్న వర్గం ఒకటి సిద్ధంగా ఉండనే ఉన్నది.

రాయ్ కాలంలో భారతదేశం విప్లవానికి ఎంత దూరాన ఉండేదో, నేటికీ అంతే దూరంగా ఉంది. ఐతిహాసిక ప్రగతి అవసరాల దృష్ట్యా విప్లవం అత్యవసరమై ఉన్నప్పటికీ, ఉన్న పరిస్థితి ఇదే. అయినా అట్టడుగు నుంచి విప్లవాన్ని సాధించడానికి తగు పద్ధతిని రూపొందించడానికే తన నైతిక శక్తినీ, మేధనూ వినియోగించాడు రాయ్ -- అతడి తత్వం, గాంధీ, మార్క్సుల తత్వాలకు భిన్నమైనది -- ఈ విషయాలలో రాయ్‌కి పోలిక మార్క్స్ మాత్రమే; మార్క్స్ తన జీవిత కాలంలో సాధించినదేమున్నది గనక? అట్టడుగు నుంచి విప్లవం పైకి రావాలని ప్రబోధిస్తున్నప్పటికీ, తెల్లదొరల నుంచి అధికారం నల్లదొరల చేతులలోకి రానున్నదనే భయం ఆయన ముందుగానే బైటపడ్డాడు.

అతడి సమకాలిక విప్లవ నాయకులవలే అతడి అనుభవాలు ఏదో ఒక దేశానికి పరిమితం అయినవి కావు — జన్మభూమికే పరిమితం కావు. అతడి అనుభవాలు దేశ దేశాలలో అతడు సేకరించుకున్నవి -- ఇంత అనుభవ జ్ఞానంతో అతడి వ్యక్తిత్వం నిర్మితమైనది. కలకత్తా ప్రాంతంలోని అర్బేలియా అనే కుగ్రామంలో 1887 మార్చి 21న జన్మించాడు -- దీనబంధు అనే సంస్కృత ఉపాధ్యాయుని రెండవ భార్యకు కలిగిన నాలుగవ కుమారుడు -- అతడి జన్మనామం నరేంద్రనాథ్ భట్టాచార్య. బెంగాల్‌లో నెలకొన్న విప్లవకారుల సంఘంలో 1905లో చేరాడు -- 1907లోనే మొదటి రాజకీయ దోపిడీలో పాల్గొన్నాడు. ప్రథమ ప్రపంచ యుద్ధ ప్రారంభ కాలంలో, బ్రిటిష్ పరిపాలనపై సాయుధ తిరుగుబాటు చేయడానికి ప్రచ్ఛన్న విప్లవకారులను సంఘటిత పరచాలని ప్రయత్నించాడు. ప్రచ్ఛన్న కార్యకలాపాలలో పాల్గొనేవాడు కాబట్టి మారు పేర్లతో వ్యవహరించవలసి వచ్చేది -- అప్పట్లో అతడి మారు పేర్లు కొన్ని -- వైట్, మార్టిన్, మెండెజ్, గార్సియా, వగైరా. జర్మనీ నుండి ఆయుధాలను, పేలుడు సామాగ్రిని కొనడానికి 1915లో బటేవియాకు వెళ్ళాడు. ఈ సామగ్రి కొనుగోలు ప్రయత్నంలో అతడు ఇండోనేషియా, జపాన్, కొరియా, చైనా, ఫిలిప్పీన్స్ దేశాల ద్వారా ద్రిమ్మరి, కడకు 1916లో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోకి చేరుకున్నాడు. అక్కడ అతడు పెట్టుకున్న మారుపేరు మానవేంద్రనాథ్ రాయ్. తర్వాత తర్వాత అదే పేరిట అతడు వ్యవహరించవలసి వచ్చింది.

అక్కడ స్టాన్‌ఫర్డ్‌లో, ఎవెలీన్ ట్రినెట్ అనే విప్లవకారిణిని కలుసుకున్నాడు. తర్వాత వీళ్ళు దంపతులైనారు. ఈలోగా అమెరికా కూడా మొదటి ప్రపంచ యుద్ధంలో చేరి, జర్మనీపై యుద్ధం ప్రకటించింది. ఆ స్థితిలో 1917లో రాయ్ దంపతులు మెక్సికోకు తరలిపోవలసి వచ్చింది. మెక్సికోలో అతడు విప్లవమేధావిగా ప్రముఖుడైనాడు. శ్పానిష్ భాష నేర్చి ఆ భాషలో గ్రంథ రచనకు ఉపక్రమించాడు. మెక్సికో రిపబ్లిక్ అధ్యక్షుడు వెనుస్తియానో కరాంజాకు సన్నిహితుడై, సలహాదారైనాడు. అక్కడి విశ్వవిద్యాలయంలో అధ్యాపకత్వం కూడా నెరపాడు. మార్క్స్ ప్రభృత విప్లవ రచయితల సాహిత్యం చదివాడు. మెక్సికోలో సోషలిస్టులను కూడగట్టుకొని 1918లో మెక్సికోలో సోషలిస్టు మహాసభ జరిపించి, ఎల్ పార్టిడో కమూనిస్టో డి మెక్సికోను 1919లో నెలకొల్పాడు. లెనిన్ ప్రతినిధి

మైకేల్ బొరాడిన్‌ను ఇదే కాలంలో మెక్సికోలో కలిశాడు. లెనిన్ ఆహ్వానంపై మాస్కోకు వెళ్ళాడు. మెక్సికోలో మొత్తం రెండున్నర సంవత్సరాలున్నాడు.

తర్వాత ఎనిమిదేళ్లలో విప్లవ మేధావిగా, విప్లవ సంస్థల వ్యవస్థాపకుడుగా పేరు తెచ్చుకున్నాడు. 1920లో జరిగిన రెండవ కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభలో లెనిన్‌తో జాతీయత, సామ్రాజ్యవాదాలపై భేదాభిప్రాయాలు వచ్చినాయి. అయినా లెనిన్ సిద్ధాంతాలనూ, రాయ్ రచించిన అనుబంధ సిద్ధాంతాలనూ — కొన్ని సవరణలతో, మహాసభ వారు ఆమోదించారు.

పలువురు మార్క్సిస్టులు నమ్మినట్లే లెనిన్ కూడా విప్లవానికి యూరప్ మాత్రమే పురోగామి కాగలదని విశ్వసించే వాడు. సామ్రాజ్యవాద ప్రాబల్యాన్ని భగ్నం చేయడానికి ఆసియా దేశాలలో వచ్చే విప్లవం దారి తీస్తుందనీ, అప్పటి వరకూ యూరోపియన్ దేశాలలో వచ్చే సోషలిస్టు విప్లవం సానుకూలం కాదనీ రాయ్ వాదం. వలసలలో, పాక్షిక వలసలలో సామ్రాజ్యవాద పరిపాలనలో ఉండే ధనికులు, విప్లవంలో ప్రముఖపాత్ర వహిస్తారని లెనిన్ వాదం.

భారత దేశం, చైనాలకు చెందిన ధనిక వర్గాలలో విప్లవశక్తి మృగ్యమనీ, అక్కడి కార్మికులు, రైతులు, మధ్య తరగతిలో ఆఖరి వర్గం వారు మాత్రమే విప్లవశక్తులవుతారని రాయ్ వాదన. మధ్యలో ధనికుల ప్రజాస్వామ్యం మజిలీకి చేరాలనే సిద్ధాంతాన్ని వదలి వేసుకొని భారత చైనాలలో నేరుగా సోషలిస్టు విప్లవ సాధనను చేపట్టడమే సబబు అని రాయ్ వాదించాడు.

అట్లా తనకూ, రాయ్‌కీ విభేదాలున్నా, లెనిన్ తన సిద్ధాంతాలన్నీ, రాయ్ విశ్లేషణనూ కలిపి తీర్మానంగా ప్రతిపాదించాడు. పైగా తాష్కెంట్‌లో భారత సైనిక శిక్షణాలయం (ఇన్ దుస్కి కుర్స్) నెలకొల్పడానికి (1920 అక్టోబర్ 17) తోడ్పడ్డారు -- ఈ శిక్షణాలయంలోనే ప్రవాస భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు.

రాయ్ 1922లో ఇంగ్లీషు, జర్మన్, రష్యన్ భాషలలో చిరకాల ప్రయోజనమున్న "ఇండియా ఇన్ ట్రాన్సిషన్" అనే మహత్తర విశ్లేషణాత్మక గ్రంథాన్ని ప్రకటించాడు. అంతర్జాతీయ కమ్యూనిస్టు రెండవ మహాసభకు అతడు సమర్పించిన సిద్ధాంతానికి ఇది సమగ్ర స్వరూపం. ఆ తర్వాత (1922 మేలో) "వాన్‌గార్డ్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్" అనే పక్షపత్రికను ప్రకటించనారంభించాడు. అది రకరకాల పేర్లతో వెలువడేది. (ఉదాహరణకు — అడ్వాన్స్ గార్డ్, మాసెస్ ఆఫ్ ఇండియా). ఆ పత్రికను భారత ప్రభుత్వం తరచు నిషేధించేది. నిషేధాన్ని అధిగమించడానికి ఇట్లా మార్పులు చేసేవాడు. అయినా భారత దేశ పట్టణ వాసులలో మేధావులు పలువురు ఈ పత్రికను చదివి ప్రభావితులయ్యారు.

1922 ముగిసే నాటికి అతడు తన రచనల ద్వారా, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా, దూతల ద్వారా బెంగాల్, బొంబాయి, మద్రాసు, ఉత్తరప్రదేశ్, పంజాబులలో, కమ్యూనిస్టు బృందాలను ఏర్పర్చగలిగాడు. 1923లో "కోమింటర్న్" అధ్యక్ష మండలిలో సభ్యుడుగా ఎన్నికైనాడు. మరుసటి సంవత్సరం కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైనాడు -- కోమింటర్న్ వ్యవస్థా నిర్మాణ సంఘంలో సభ్యుడైనాడు. 1926లో అతడు రచించిన భారత రాజకీయ భవిష్యత్తు అనే గ్రంథం ద్వారా అతడు ఆసియా ఖండంలోకల్లా

గొప్ప మార్క్సిస్టు తాత్వికుడుగా ప్రతిష్ఠితుడైనాడు.

చైనా కమ్యూనిస్టు పార్టీకి సలహాదారుగా 1927లో అతడిని కోమింటర్న్ నియమించింది. అప్పటికే చైనా కమ్యూనిస్టు పార్టీకీ కోమింటర్న్‌కూ సంబంధాలు క్లిష్టమై ఉన్నాయి. కోమిన్‌టాన్‌గ్‌తో స్నేహ సంబంధం పెట్టుకొనాలని కోమిన్‌టర్న్ నిర్ణయం — స్నేహ సంబంధం కొనసాగిస్తూనే విప్లవ కార్యక్రమాలు, రాజకీయానుబంధాలు పెంపొందించుకుంటూ ఉండాలని కోమిన్‌టర్న్ అభిప్రాయం.

చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ విప్లవాన్నీ, రైతులకు ఆయుధ సరఫరా, గ్రామీణ స్వపరిపాలన, జాతీయ ప్రజాస్వామిక నియంతృత్వంకై తగు ఏర్పాట్లు, విప్లవ సైన్యం వగైరాలనూ చేపట్టాలని రాయ్ వాదం. దీనిని వ్యతిరేకించాడు బొరొడిన్ -- ఇతడు అంతకు ముందు నుంచీ (1923) చైనాలో కోమిన్‌టర్న్ ప్రతినిధిగా వ్యవహరిస్తూన్నాడు. అతడి అభిప్రాయం, ఏది ఏమైనా సరే కమ్యూనిస్టు పార్టీవారు కోమిన్‌టర్న్‌తో స్నేహ సంబంధాలు కొనసాగించాలనే.

చైనా కమ్యూనిస్టు పార్టీ భీరుత్వం, బొరొడిన్ సలహాలు కలసి, మొత్తం మీద రాయ్ హితవును అమలు కాకుండా చేసినాయి. అందువలన అక్కడి విప్లవ కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నది. ప్రతికూల విప్లవచర్యలు పెచ్చు పెరిగినాయి. రాయ్, బొరొడిన్ ఇద్దరూ తమ లక్ష్యాలు దెబ్బతిని, మాస్కోకు తిరిగిపోయారు.

ఈలోగా, సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వం కోసం సంఘర్షణ ప్రారంభమయింది. అప్పటివరకూ రాయ్‌ని సమర్థిస్తున్న స్టాలిన్, తన నాయకత్వాన్ని సుప్రతిష్ఠితం చేసుకునే నిమిత్తం రాయ్‌ని వదలివేసుకుని, రాయ్‌కి ప్రతికూలంగా వ్యవహరిస్తున్న మేధావి వర్గంతో కలిసిపోయాడు. రష్యాలోని పురాతపత్ర భాండారాన్ని ఏదోఒకనాడు కమ్యూనిస్టేతరులను కూడా చూడనిస్తారని ఆశిస్తున్నాను. అప్పుడు ఈ వివరాలు బహిర్గతం అవుతాయి. నాకు తెలిసినంతవరకూ, నా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, కోమిన్‌టర్న్‌లోని మనుల్‌స్కీ, ష్లత్నిత్స్‌కీ, క్యూసినెన్ ప్రభృతులకు ఈ నాయకత్వం పెనుగులాట అనుకూలమై, స్వతంత్ర ఆలోచనలు గల రాయ్‌ని తోసివేయడానికి అక్కరకు వచ్చింది. అటువంటి చర్య స్టాలిన్‌కు కూడా ఉపకరించింది.

ఏమైనప్పటికీ కోమిన్‌టర్న్ నుంచి రాయ్‌ని తొలగించడానికి చైనా వ్యవహారం మాత్రం కారణం కాదు. కోమిన్‌టర్న్ ఆరవ మహాసభ (1928)లో ఆత్మహత్యాసదృశమైన తీర్మానం ఒకటి చేశారు -- ''సోషల్ డెమాక్రాట్లు శత్రువులనీ, నాజీ ఫాసిస్టులకంటే పెద్ద శత్రువులనీ'' ఈ తీర్మానం పేర్కొన్నది. ఇది చాలా ప్రమాదకర నిర్ణయమని రాయ్ భావం. అతడు అప్పుడు అనారోగ్యం వలన మహాసభకు హాజరు కాలేదు. ఈ తీర్మానం ప్రమాదకరమని జర్మన్ కమ్యూనిస్టు పత్రిక ''అపోజిషన్''లో వ్యాసాలు వ్రాసాడు. అప్పటికీ ఇప్పటికీ రాయ్ చేసిన తప్పులేమో కమ్యూనిస్టు పార్టీ వివరించనేలేదు -- కానీ ''అపోజిషన్'' పత్రికలో తన భావాలు వెల్లడించడమే తప్పు అన్నారు!

1928 నుంచి 1930 వరకూ బెర్లిన్‌లో నివసించాడు రాయ్. చైనా పైన అతడు వ్రాసిన నివేదికను 1929లో మాస్కో నుంచి అధికారికంగా ప్రచురించారు. కానీ అతడికి మాత్రం దీని ప్రతి లభించనే లేదు. కానీ అక్కడ ఉన్న రెండున్నర

సంవత్సరాలలో అతడు ''చైనాలో విప్లవం, ప్రతి విప్లవం'' అనే ఉద్గ్రంథం రచించాడు. ''బ్రిటిష్ సామ్రాజ్య క్షయం, పతనం'' (డిక్లయిన్ అండ్ ఫాల్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్) అనే పరిశోధన గ్రంథం కూడా ఇదే కాలంలో రచించాడు. దీనిని నాజీలు సైకి రాకుండా నాశనం చేసినట్లు విదితం అవుతున్నది. చైనాను గురించిన గ్రంథం మాత్రం 1930లో ప్రచురణ పొందింది. 1937లో అతడు బెర్లిన్‌లో ఎలీన్ నొట్స్‌చాక్‌ను పెళ్ళి చేసుకున్నాడు -- ఆమె ఆయన రెండవ భార్య (ఎవెలిన్ 1926లోనే అమెరికాకు తిరిగి వెళ్ళింది).

విప్లవవాదికి పాండిత్యం వలననే తృప్తి కలగదు. స్నేహితులు వద్దంటున్నా విన కుండా భారత దేశానికి తిరిగి వచ్చేయా లని సంకల్పించాడు రాయ్. ఇస్తాన్‌బుల్, బాగ్దాద్‌ల మీదుగా కరాచీకి చేరుకున్నాడు -- 1930 డిసెంబరులో కరాచీలో జరిగిన కరాచీ కాంగ్రెసు మహాసభలో, నెహ్రూ ఆహ్వానంపై పాల్గొన్నాడు. అప్పట్లో అతడి మారుపేరు ''డాక్టర్ మహ మూద్''. స్వదేశంలో ''భారతీయ శ్రామిక విప్లవం'' అనే ఒక వ్యవస్థను నెలకొల్పి, కార్మిక సంఘాలలోనూ, రైతు లతోనూ పని చేయడానికి యువ విప్లవకా రులకు తర్ఫీదు చేయపూనుకున్నాడు. 1931 జులైలో అతడిని అరెస్టు చేసి పన్నెండేళ్లు ద్వీపాంతరవాస శిక్ష విధిం చారు. అప్పీలులో దానిని ఆరేళ్ల కఠిన శిక్షకు తగ్గించారు.

అరెస్టు అయిన అతడి ఆరోగ్యం చెర సాలలో దెబ్బతిని పోయింది. కానీ చదువు కొనడానికీ, వ్రాసుకొనడానికీ చెరసాల అనువైన చోటు. 1936 నవంబరులో అతడిని విడుదల చేశారు. ''ఫిలసాఫికల్ కాన్‌సిక్వెన్సెస్ ఆఫ్ మోడరన్ సైన్సు'' అనే శీర్షిక కింద తాను వ్రాసిన తొమ్మిది సంపుటాల విధిత గ్రంథంతో చెరసాల నుంచి బయటపడ్డారు. తర్వాత దీనిలో కొన్ని భాగాలు వివిధ శీర్షికల కింద వ్యాసాలు వ్యాసాలుగా పత్రికలలో అచ్చు అయినాయి. ఆ విధిత గ్రంథం మాత్రం నెహ్రూ మ్యూజియంలో భద్రంగా ఉంది. సాహసం గల ప్రచురణకర్త ముందుకు వస్తే అది అచ్చు అవుతుంది.

విడుదల అయిన తర్వాత, కాంగ్రెసు లోనే కిసాన్ విప్లవాన్నీ, మతాతీత ప్రజా స్వామిక తత్వాన్నీ ప్రధానం చేయడానికి ఒక బలీయమైన వర్గాన్ని తయారుచేయా లని పూనుకున్నాడు. అతడు 1920 నుంచీ గాంధీ ప్రభృతులకు వ్యతిరేకంగా విప్లవం సాధించాలని ప్రకటనలు చేస్తూనే ఉన్నాడు. కాంగ్రెసు ప్రాథమిక సంఘాలు ప్రజా సంఘాలు కావాలనీ, రాజ్యాంగ సభను తీర్చిదిద్ది భారత దేశాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించి తగు ప్రజా స్వామిక రాజ్యాంగ వ్యవస్థను రూపొందిం చాలనీ, సాంస్కృతిక విప్లవం సాధించాలనీ రాయ్ చాలా ఏళ్లుగా వాదిస్తూనే ఉన్నాడు. ఈ ప్రచారానికీ ప్రబోధానికీ అనువుగా అతడు 1937 ఏప్రిల్ నుంచీ ''ఇండిపెండెంట్ ఇండియా'' అనే వార పత్రిక నిర్వహించాడు.

రెండవ ప్రపంచ యుద్ధం వచ్చేసరికి గాంధీ వర్గంతో రాయ్ సంఘర్షణ బాగా పైకి ఉబికింది. భారతదేశం ప్రజాస్వామిక వ్యవస్థను కట్టుపడినది కాబట్టి ఈ యుద్ధంలో జర్మనీ కూటం రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడే రాజ్యాల పక్షాన భార తదేశం పోరాడాలని రాయ్‌వాదం ఇటు వంటి చర్య ఫాసిస్టు వ్యతిరేక కార్యక్రమం అవుతుందని, దీనివలన బ్రిటిష్ సామ్రాజ్య విచ్ఛిన్నానికి కూడ దారితీస్తుందని ఆ వాదం సారాంశం. దీనివలన భారతదేశా

నికి స్వాతంత్ర్యం లభిస్తుందనీ, యుద్ధంలో పాల్గొడం వలన భారతదేశానికి ప్రజాస్వామికావసరాన్ని తీర్చే బలం కూడా కలుగుతుందని ఆయన విశ్వాసం.

1940లో కాంగ్రెసుతో విభేదం తీవ్ర మైంది - రాయ్ బయటకు వచ్చాడు -- రాడికల్ డెమాక్రాటిక్ పార్టీ నెల కొల్పాడు. ముసాయిదా ''భారత రాజ్యాంగం'' ఆర్థికాభివృద్ధి ప్రణాళిక (1944) రచించాడు - అవి స్వతంత్ర భారతదేశానికి తన నమ్మకాలను బట్టి ఉపకరించేవిగా రచించాడు.

స్టాలిన్ నాయకత్వం కింద రష్యా కేవలం నియంతృత్వ దేశమయింది -- కమ్యూనిజం ఒక స్వాతంత్ర్య ప్రదాయి అయిన విప్లవ మార్గం అనే భ్రమ లేకుండా పోయింది రాయ్‌కి. అట్లా అని పెట్టుబడి దారీ పద్ధతి ద్వారా బుర్జువా ప్రజాస్వామీకం ద్వారా విముక్తి వస్తుందా? ఆయన నమ్మలేదు. ఉదారతత్వానికీ, సోషలిజానికీ ప్రత్యామ్నాయంగా రాడికల్ కమ్యూనిజం అనే తత్వాన్ని ప్రతిపాదిస్తూ దానిపై 1946 నుంచీ తన ఆలోచనను పూర్తిగా కేంద్రీకరించాడు.

భౌతికవాదం, హేతువాదం, విశ్వస్వామిక వాదం, స్వేచ్ఛ, వికేంద్రీకరణ, సహకారతత్వం, నైతికతత్వం, మతాతీత దృక్పథం, ప్రత్యక్ష ఎన్నికలు, ప్రజాస్వామిక నిర్ణయ వ్యవస్థ -- ప్రభుత్వం అనేక ప్రగతిశీల లక్షణాలతో ఈ మానవతా వాదాన్ని తీర్చిదిద్దాడు. ఇదే పెట్టుబడి దారీ వ్యవస్థకు, సోషలిస్టు నియంతృత్వానికి తగు ప్రత్యామ్నాయంగా ఆయన సహేతుకంగా నిరూపించాడు.

1952 జూన్‌లో ముస్సోరీలో 50 అడుగుల ఎత్తు కొండ నుంచి నడుస్తూ జారిపడ్డాడు రాయ్. ఆ తర్వాత రెండు పర్యాయాలు మస్తిష్క (Cerebral Thombosis) వ్యాధితో బాధపడ్డాడు. మూడవ సారి, 1954 జనవరి 25 అర్ధ రాత్రి మళ్లీ అదే వ్యాధి వచ్చి డెహ్రాడున్‌లో కన్నుమూశాడు.

ప్రస్తుతం ప్రపంచం చాలా క్లిష్ట పరిస్థితిలో ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడడానికి రాయ్ నిర్వచించిన పద్ధతి తగినదవునో కాదో విజ్ఞులు పరిశీలించ వలసి ఉన్నది. ఆయన జీవిత సరళి ఆదర్శవంతమైనది. ఎక్కడో కుగ్రామంలో ఒక పేద బ్రాహ్మణుని ఇంట పుట్టి, సాంప్రదాయక వాతావరణంలో పెరిగి, ఆత్మవిశ్వాసంతో వ్యక్తిత్వాన్ని సంతరించుకుని, విప్లవవాదిగా మారి, సాంఘిక న్యాయం కోసం, హేతుబద్ధ జీవన సరళి కోసం, వ్యక్తి స్వాతంత్ర్యం కోసం కృషి చేశాడు. భారతీయ జాతీయ వాదం నుంచి మార్క్స్ వాదంలోకి మారాడు. ఆపైన రాయ్ -- . విశ్వస్వామ్యాన్ని గురించి కలలు కన్నాడు. భారత, రష్యా, మెక్సికో, జర్మనీ, చైనాలలో రాజకీయ సంక్షోభాలలో పాల్గొన్నాడు. మేధావి -- పండితుడు -- బహు భాషావేత్త -- ఐదారు భాషలలో గ్రంథకర్త -- రాయ్

స్వయంభూ లాంటివాడు -- ఆయన మానవతావాదం ఆయన ఆలోచనల ఫలం. ప్రజలు ఇట్లా ఎవరి తీరును వారు స్వయంగా తీర్చిదిద్దుకొనవచ్చు నని ఆయన విశ్వాసం -- ఎవరి వ్యక్తిత్వాన్ని వారు నిర్మించుకోగలరని ఆయన విశ్వాసం.

— శిబ్‌నారాయణ్ రే

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt.Ltd.
1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

AN ADVANCED

TECHNOLOGY

FOR AN IMPROVED

QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.